జంక్షన్ జామ్ !

నడిరోడ్డుపై రెండు నెలలుగా డ్రైనేజీ పొంగుతున్నా పట్టించుకోని వైనం

ముషీరాబాద్‌: రాంనగర్ చౌరస్తా నుంచి విద్యానగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి రాంనగర్ మీసేవా వద్ద గత రెండు నెలలుగా డ్రైనేజీ పొంగుతోంది. ఈ రహదారికి కుడిపక్కనే హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ నివాసం. ఎడమ పక్క బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ కార్యాలయం, కొద్ది దూరంలో అడిక్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయం నిత్యం వేలాదిగా వాహనదారులు, రాకపోకలు సాగించే ప్రధాన మార్గం, ఎమ్మెల్యే ముఠా గోపాల్ రోజుకు ఒక్కసారైనా ఈ దారి గుండా వెళ్తుంటారు.

ఎన్నికల వేళ..

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రోజుకు 10–15 కొత్త డ్రైనేజీ పైపులైన్లకు ప్రారంభోత్సవాలు జరిగినప్పటికీ ఈ పైపులైన్లను మాత్రం మార్చే ప్రయత్నం, మరమ్మతులు చేసే ప్రయత్నం చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాంనగర్ చౌరస్తా నుంచి రాంనగర్ నాలా వరకు ఈ డ్రైనేజీ పైపులైన్లు మొత్తం జామ్ కావడంతో ఈ లైన్‌లో కలిసే ఇళ్లపైపులు కూడా జామై రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇంటి యజమానులు, దుకాణాదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.



రాంనగర్ మీసేవా కేంద్రం వద్ద పొంగుతున్న డ్రైనేజీ

☛ ఇక ఈ మురుగు నీరు దుకాణాల ముందు నుంచి ప్రవహిస్తూ.. రాంనగర్ మేడి బావి బస్తీ, దీన్‌దయాల్‌నగర్‌ల మీదుగా వెళ్లడంతో అక్కడ ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కోట్ల నిధులు ఎక్కడ కేటాయిస్తున్నారు



గత నెల రోజులుగా ఎటు చూసినా కోట్ల రూపాయలతో డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు, సీసీరోడ్లను నిర్మిస్తున్నామని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు గొప్పలు చెప్పుకుంటున్నారు. గత 2–3 రోజులుగా ఎన్నికల కోడ్ వస్తుందని ఒకే రోజు పదుల సంఖ్యలో శంకుస్థాపనలు చేశారు. కానీ ప్రధాన రహదారిలో గత రెండు నెలలుగా నడిరోడ్డుపై డ్రైనేజీ వ్యవస్థ జామై ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రజాప్రతినిధులకు, ఇక్కడి అధికార పార్టీ నాయకులకు కనిపించడం లేదు. ఎన్నికల ముందు హడావిడి తప్ప వాస్తవ రూపంలో జరిగిన అభివృద్ధి జరగలేదు.

– ఆర్.నరేష్, బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు

15న సిద్ధ నాట్య కళా సమితి ప్రారంభోత్సవం



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వసుంధర

చిక్కడపల్లి: వాగ్గేయకారుల రచనలకు నాట్యప్రదర్శనల ద్వారా బహుళ ప్రాచుర్యం కల్పించడానికి యువ కళాకారులకు ఆ సాహిత్యంలోని అంతరాన్ని తెలియజేసేందుకు సుద్ధ నాటకళా సమితి పేరిట నూతన సంస్థను అక్టోబర్ 15న ప్రారంభిస్తున్నట్లు సమితి అధ్యక్షురాలు వి.వాణీరమణ, కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌లు తెలిపారు. బుధవారం చిక్కడపల్లి ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉప సంచాలకురాలు జి.వసుంధర, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వి.వాణీరమణ, కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ దేవులపల్లి రామానుజ రావు కళామందిరంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రామణాచారి ముఖ్య అతిథిగా హాజరు అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిష్ఠల సుధామాల, నళినీ రమణ, మాధవీమాల, వి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు హక్కులపై అవగాహన ఉండాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ మహేంద్ర కుమార్‌రెడ్డి తదితరులు

ముషీరాబాద్‌: బాలికల జీవితాలలో మార్పు రావాలంటే హక్కులపై అవగాహన కలిగి ఉండాలని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా భోలక్‌పూర్‌లోని ఎస్సీ బాలికల వసతి గృహంలో డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్, నవభారత్ లైన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో బాలికల హక్కులు, నాయకత్వం, శ్రేయస్సుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి, హిప్నో పద్మాకమలాకర్‌లు మాట్లాడుతూ.. ప్రతి బాలిక చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. చదువును మధ్యలో ఆపకుండా ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. సామాజిక అంశాలు, లైంగిక వేధింపులపై అవగాహన కలిగి ఉండాలని, భయపడకుండా తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా బాలికలకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన బాలికలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

నేషనల్ బాక్సర్‌కు సన్మానం

చిక్కడపల్లి: ఆలిండియా పోలీస్ బాక్సింగ్ నేషనల్ గేమ్స్– 2023లో బ్రౌంజ్ మెడల్ సాధించిన గాంధీనగర్ డివిజన్‌కు చెందిన నేషనల్ బాక్సర్ ప్రశాంత్‌ను సన్మానించారు. గత వారం హరియాణాలో జరిగిన ఈ చాంపియన్‌షిప్‌లో పోలీసు ఉద్యోగి ప్రశాంత్ మెడల్ సాధించడంతో ఆయన విజయోత్సవ ర్యాలీని బుధవారం రాత్రి గాంధీనగర్ డివిజన్‌లో స్థానిక యువత నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్ ఎస్ఆర్టీ క్వార్టర్స్ నల్లపోచమ్మ దేవాలయం చైర్మన్ బింగి సాయికీర్తిక్ (బాబ్జీ), ఆలిండియా యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌యాదవ్, గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్‌కెన్నడీలు పాల్గొని ప్రశాంత్‌ను అభినందించి మాట్లాడారు. ఆర్వింద్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

19న బతుకమ్మ సంబరాలు

అంబర్‌పేట: బతుకమ్మ సంబరాలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. నియోజకవర్గంలో ఈనెల 19న అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో ప్రతిష్టాత్మకంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన ప్రకటించారు. బుధవారం బాగ్ అంబర్‌పేట సోమసుందర్‌నగర్ పార్క్‌లో బతుకమ్మ సంబరాల పోస్టర్‌ను స్థానిక కార్పొరేటర్‌లు పద్మావెంకట్‌రెడ్డి, విజయకుమార్‌గౌడ్‌లు, స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. నియోజకవర్గంలో ఆడపడుచుల అందరి భాగస్వామ్యంతో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకులు చందు, మేడి ప్రసాద్, శ్రీరాములు ముదిరాజ్, రవీందర్‌రావు, బిష్మా తదితరులున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

పోస్టర్ ఆవిష్కరణ



దేవీ నవరాత్రి ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ముషీరాబాద్‌: దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 15వ తేదీ నుంచి ముషీరాబాద్ ఫ్రెండ్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే దుర్గామాత మండపంలో ఉత్సవాలు ప్రారంభమవుతాయని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శ సభ్యులు జమాల్‌పురి నందు తెలిపారు. బుధవారం ముషీరాబాద్‌లో దేవి నవరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని, 20వ తేదీ రాత్రి 9 గంటలకు అమ్మవారి మండపం వద్ద దుర్గామాత జాగరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ముఖ్య అతిథిగా హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ తదితరులు హాజరవుతారన్నారు. ఉత్సవ నిర్వాహకులు ఆయుష్ శ్రీనివాస్, బ్రహ్మచారి, దిలీప్, విక్కీ, దీపక్ తదితరులున్నారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

ముషీరాబాద్‌: చిన్నారి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ యువకుడికి స్పెషల్ కోర్టు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ బుధవారం తీర్పును వెలువరించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. 2022 జూన్ 21న ఓ బాలిక తన తాత చనిపోవడంతో ముషీరాబాద్‌కు వచ్చి రాత్రివేళ తన తల్లి, ఇతర బంధువులతో కలిసి ఇంటి డాబాపై పడుకుంది. తెల్లవారు జామున పక్కింట్లో ఉండే కరుణాకర్ అనే యువకుడు నిద్రపోతున్న చిన్నారి వద్దకు వచ్చి ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో చిన్నారి కేకలు వేయడంతో ఆమె కుటుంబసభ్యులు నిందితుడిని పట్టుకుని ముషీరాబాద్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు పోస్కో చట్టం కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో 12 మంది సాక్షులను విచారించి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయగా.. కోర్టు సాక్షులను పరిశీలించి బుధవారం నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమాన విధించారు.

హోటళ్లలో ముమ్మర తనిఖీలు

అడ్డగుట్ట: ఎన్నికల కోడ్ అమలైన సందర్భంగా లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు హోటళ్లలో ఇన్‌స్పెక్టర్ మధులత ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలైన నేపథ్యంలో పీఎస్ పరిధిలోని బార్డర్లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనాలు తనిఖీలు, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేపట్టామన్నారు. తార్నాక విజయపురి కాలనీలోని హ్యాపీ హోటల్, లాలాపేటలోని ఎలైట్ హోటళ్లను బుధవారం తనిఖీ చేసి కస్టమర్ల వివరాలు ఎప్పటికప్పుడు నోట్ చేస్తున్నారా లేదా అనే వివరాలు సేకరించారు. రిజిస్టర్‌లు చెక్ చేయడంతో పాటు పలు రూమ్‌లలో కస్టమర్ల బ్యాగులు సైతం తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు షాహీద్ పాషా, అమర్ సింగ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలను అన్ని పార్టీలు చర్చించాలి

లిబర్టీ: రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రణాళికలో చేర్చాలని ఆమ్ ఆద్మీ పార్టీ అనుబంధ విభాగం ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు రుద్రాక్ష మల్లేష్ అన్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా పార్టీలు చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయా పార్టీలు అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారో స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల కోసం ఆటో బంధు పథకం ఆటో కొనుగోలుకు వడ్డీ లేని రుణాలు, జీవిత బీమా సౌకర్యం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ప్రమాదవశాత్తు మరణిస్తే ఆటో రిక్షా డ్రైవర్ కుటుంబానికి రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ట్రాఫిక్ పోలీసుల ఆగడాలను నియంత్రించాలని, ఆర్టీఏ చాలన్ రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఫరూక్ పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

పంజగుట్ట: ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఏ ఇంటికి వెళ్లినా సమస్యలు చెబుతున్నారని, ఏ వీధి చూసినా ఎన్నో సమస్యలు ఉన్నాయని మరి కొద్దిరోజుల్లోనే మన ప్రభుత్వం రాగానే అన్ని పరిష్కరించుకుందామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల స్కీంలను ప్రజల్లోకి తీసుకువెళ్లే కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె చింతల్‌బస్తీ, బిస్తీవాడ, ఏసీ గార్డ్స్ తదితర ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన ఉందని ప్రజలు మార్పు కోరుకుంటున్నారని స్పష్టమవుతోందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

జంగ్ తెలంగాణ 2023



వివిధ రాజకీయ పార్టీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న అంబర్‌పేట ఆర్‌వో అపర్ణ

అంబర్‌పేట్: ఎన్నికల నిబంధనలు అన్ని రాజకీయ పార్టీలు పాటించి సహకరించాలని అంబర్‌పేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అపర్ణ వివిధ రాజకీయ పార్టీల నేతలను కోరారు. బుధవారం జీహెచ్ఎంసీ సర్కిల్–16 కార్యాలయంలో ఆమె వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని దానిని అమలు చేసే బాధ్యత తమపై ఉందన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన జరగకుండా అన్ని బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రచార ఫ్లెక్సీలు, పోస్టర్లు, ర్యాలీలు చేయడానికి తమ వద్ద అనుమతి తీసుకోవాలని ఆర్ఓ పార్టీ నేతలకు సూచించారు. అనుమతి కోసం సువిధ వెబ్ పోర్టల్ అందుబాటులో ఉందని దాని ద్వారా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై సహితం తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ 50 రోజులు అన్ని పార్టీల అభ్యర్థులు నేతలు సహకరిస్తేనే అంబర్‌పేట నియోజకవర్గంలో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

అంతా సమానమే..

తాము ఎన్నికల కమిషన్ నియమించిన అధికారులమని, అన్ని పార్టీల పట్ల సమానంగా వ్యవహరిస్తామన్నారు. పక్షపాత ధోరణితో అధికార యంత్రాంగం వ్యవహరించదని ఆర్ఓ తేల్చి చెప్పారు. రాజకీయ పార్టీల నేతలకు తమపట్ల అపోహలు ఉండరాదన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం వివిధ రకాల బృందాలను ఏర్పాటు చేసి సమన్వయంగా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఏఆర్ఓలు మారుతీ దివాకర్, వీరస్వామి, భిక్షపతి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అజయ్‌కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

అన్ని పార్టీలు రైతుల సమస్యలను మ్యానిఫెస్టోలో చేర్చాలి



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నవంబర్ 30న జరిగే శాసనసభ ఎన్నికలను పురస్కరించుకుని అన్ని రాజకీయ పార్టీలు రైతుల సమస్యలను తమ మ్యానిఫెస్టోలో చేర్చాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ధరణిలోని లోపాలను పరిష్కరించడంతో పాటు వ్యవసాయశాఖలో చేపట్టాల్సిన చర్యలను మ్యానిఫెస్టోలో చేర్చాలన్నారు. విత్తనాల చట్టం, ఉచిత విద్యుత్, వ్యవసాయ రుణాలు, మార్కెట్ కమిటీల ఎన్నిక, కనీస మద్దతు ధర, అటవీ హక్కుల చట్టం అమలు, సహకార వ్యవస్థను పటిష్ఠం చేయడం, నీటి పారుదల అభివృద్ధి, రైతుల ఆత్మహత్యల నివారణ తదితర అంశాలను తమ మ్యానిఫెస్టోలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు పి.సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి పశ్య పద్మ, వివిధ రైతు సంఘాల నాయకులు రాయల చంద్రశేఖర్, మల్లులక్ష్మి, నంద్యాల నర్సింహ్మారెడ్డి, జంగారెడ్డి, అరబండి ప్రసాద్‌రావు, చంద్రారెడ్డి, మూడ్ శోభన్‌నాయక్, ప్రసాద్, ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై కరపత్రం విడుదల



విడుదల చేస్తున్న వల్లభనేని ప్రసాద్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అన్ని రాజకీయ పార్టీలు దివ్యాంగుల సమస్యలను తమ మ్యానిఫెస్టోలో పొందుపరచాలని డెవలప్‌మెంట్ 'సొసైటీ ఫర్ ది డెఫ్' జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని తన కార్యాలయంలో దివ్యాంగుల డిమాండ్ల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల్లో అర్హులైన వారందరికీ రూ.10 వేలు ఇవ్వాలని, చట్ట సభల్లో 4 శాతం రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. దివ్యాంగుల బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ, మూడు చక్రాల మోటరు వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రతి రాజకీయ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపరచాలని కోరారు. నేషనల్ కో– కన్వీనర్ వి.భారతి, కె.వెంకటేష్‌గౌడ్, కిషోర్ తదితరులున్నారు.

పట్టణాల్లోని నిరాశ్రయులను ఆదుకోవాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జీవన్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పట్టణ ప్రాంతాల్లో నివసించే నిరాశ్రయులను ప్రభుత్వం ఆదుకోవాలని మానవ హక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల కన్వీనర్ ఎస్.జీవన్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అంతర్జాతీయ నిరాశ్రయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని క్యాంపెన్ ఫర్ సిటిజన్స్ షెల్టర్స్, నిరాశ్రయ శ్రామిక సంఘటన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిరాశ్రయుల సమస్యలపై కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం జీవన్‌కుమార్ మాట్లాడుతూ.. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిరాశ్రయుల కోసం షెల్టర్ హోమ్స్ నడిపిస్తున్న పలు స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వ సహకారం అందించాలని కోరారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు హైదరాబాద్‌లో ప్రతి లక్ష జనాభాకు ఒక షెల్టర్ హోమ్‌ను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిరాశ్రయుల కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఆయన కోరారు. డీబీఎఫ్ జాతీయ కన్వీనర్ శంకర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు ఎస్.ఎల్.పద్మ, ఐద్వా రాష్ట్ర నాయకురాలు ఆశలత, సిస్టర్ లిస్సి, ఫిరోజ్, సంధ్య, పద్మ, కె.అనురాధా, జయశ్రీ, ఇందిరా తదితరులున్నారు.

13న పొదుపు సంఘాల మహిళా చైతన్య సదస్సు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు డాక్టర్ ఎన్.గౌతంరావు

కాచిగూడ: అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఈ నెల 13న పొదుపు సంఘాల 'మహిళా చైతన్య సదస్సు' ను నిర్వహిస్తున్నట్లు బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు తెలిపారు. బుధవారం బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో మహిళా ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. మహిళలను అభివృద్ధిలో భాగస్వామ్యం, మహిళల సమస్యల పరిష్కారానికి ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 20న అంబర్‌పేట మున్సిపల్‌గ్రౌండ్‌లో నిర్వహించే బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై చర్చించనున్నట్లు తెలిపారు. బీజేపీ అంబర్‌పేట కన్వీనర్ శ్యామ్‌రాజ్, ఆర్తీ, జ్యోతి, విజయ, అనురాధ, రమ్య, స్వప్న, వరలక్ష్మి, సునంద, సావిత్రి, సరోజనమ్మ పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకోవాలి



విద్యార్థులతో పీ.వీ.రమణకుమార్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమ శిక్షణను అలవర్చుకున్నప్పుడే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని అంబేడ్కర్ విద్యాసంస్థల జాయింట్ సెక్రటరీ పీ.వీ.రమణ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ డిగ్రీకళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు ఆర్థిక అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను అధిగమించేందుకు విద్యార్థులు నూతన వరవడిని సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు తమ విద్యలో నైపుణ్యాన్ని సాధిస్తూ.. ఉపాధి పొందడమే కాకుండా ఇతరులకు ఉపాధి కల్పించే దిశగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఐసీఐసీఐ సెక్యూరిటీ హెడ్ రోహిత్, బ్రాంచ్‌హెడ్ రామాంజనేయులు, రీజనల్ హెచ్‌ఆర్. లాహిత్య, అంబేడ్కర్ కళాశాల డైరెక్టర్ రిషికాంత్, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరాజు తదితరులున్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. గోల్నాక ఫీడర్ పరిధిలో జేశ్వాల్‌గార్డెన్, తులసీనగర్, తిరుమల్‌నగర్, మారుతీనగర్, ఛే నెంబర్ ఫీడర్ పరిధిలో గోల్నాక చర్చ్, అశోక్‌నగర్, తిలక్‌నగర్, ఛే నెంబర్ వెజిటెబుల్ మార్కెట్, శివం ఫీడర్ పరిధిలో ప్రశాంత్‌నగర్, పీఆర్టీ క్వార్టర్స్, తరుణి సూపర్ మార్కెట్, నర్సింహ్మ బస్తీ తదితర ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, తిలక్‌నగర్ ఫీడర్ పరిధిలో తిలక్‌నగర్ క్రాస్ రోడ్డు, ఛే నెంబర్ క్రాస్ రోడ్డు, అంబర్‌పేట మెయిన్ రోడ్డు, సంజీవయ్యనగర్ ఫీడర్ పరిధిలో సంజీవయ్యనగర్, తిలక్‌నగర్, మీసేవా, శివాలయం తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు, నెహ్రూనగర్ ఫీడర్ పరిధిలో నెహ్రూనగర్, కృష్ణానగర్, గోల్నాక చర్చి తదితర ప్రాంతాలలో 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ప్రకటించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ముషీరాబాద్‌: కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల ప్రకారం విద్యానగర్‌లోని వివేకానంద డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకులను గంటల ప్రకారం నియమించడానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.సుకన్య అర్హులైన అభ్యర్థులను 12వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 13న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందని ప్రకటించారు. బీఏ(ఎల్) తెలుగు–1 పోస్టుకు పీజీలో కనీసం 55 శాతం మార్కులు (ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం) సంబంధిత సబ్జెక్ట్‌లో పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. పీహెచ్‌డీ అభ్యర్థులు లేనిపక్షంలో నెట్, సెట్ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని వివరించారు. బోధన అనుభవం కలిగిన వారికి వెయిటేజీ ఇస్తామని వీరు తమ సర్వీస్ సర్టిఫికెట్ సమర్పించాలని కోరారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూ జరిగే విద్యానగర్‌లోని వివేకానంద డిగ్రీ కళాశాలకు హాజరుకావాలని కోరారు.

కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ వైఎస్ స్వర్ణలత తదితరులు

కాచిగూడ: హైదరాబాద్ జిల్లా ఇంటర్ జూనియర్ కాలేజ్ కబడ్డీ టోర్నమెంట్ ఎల్.బీ.స్టేడియంలో ప్రారంభమయ్యాయి. కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టు పాల్గొని బుధవారం ఫైనల్‌కు చేరుకుంది. ప్రిన్సిపల్ వైఎస్ స్వర్ణలత, హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి డి.ఒడ్డెన్న, హైదరాబాద్ జిల్లా జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ప్రసాదరావు, హైదరాబాద్ జిల్లా జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు పర్వతాలుగౌడ్, కాచిగూడ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

మైక్రో బయోలజీ జాతీయ సదస్సు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మైక్రోబయోలజీ విభాగం జాతీయ సదస్సు ప్రారంభమైంది. బుధవారం ఓయూ దూరవిద్య ఆడిటోరియంలో పోస్ట్ పాండమిక్ సినారియో ఇంపెండింగ్ వైరల్ రీసెర్చ్ అనే అంశం పై జరిగిన జాతీయ సదస్సుకు మైక్రో బయోలజీ విభాగం హెడ్, సీఎఫ్ఆర్డీ డైరెక్టర్ ప్రొ.బూర్గుల సందీప్త అధ్యక్షత వహించగా ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి సదస్సులతో విషయ పరిజ్ఞానం పెరిగి నూతన ఆలోచనలు చేకూరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ మెడికల్ కాలేజీ ప్రొ.నాగమణి, డాక్టర హమీదాబీ, డా.శాంతికుమారి, ప్రొ.గోపాల్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు

అబిడ్స్: కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డిని గోషామహల్ నియోజకవర్గం బీజేపీ సీనియర్ నాయకులు కలిశారు. గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునందన్ యాదవ్ తన బయోడేటాను కిషన్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా రఘునందన్ యాదవ్ మాట్లాడుతూ.... 43 ఏళ్లుగా బీజేపీలో ఒక క్రమశిక్షణ గల కార్యకర్తగా ఉంటూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్న తనకు టికెట్టు కేటాయిస్తే భారీ మెజార్టీతో విజయం సాధిస్తానన్నారు.